



వెల్లువెత్తిన అభిమానం



విశాఖ విమానాశ్రయం వద్ద కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడులకు ఘన స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు ఘన స్వాగతం



టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన పల్లా శ్రీనివాసరావును గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



విమానాశ్రయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు స్వాగతం పలుకుతున్న పార్టీ జిల్లా నాయకులు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు సోమవారం విశాఖపట్నం విమానాశ్రయంలో అనకాపల్లి జిల్లా పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ సీనియర్ నాయకులు డాక్టర్ నారాయణరావు, కోట్ని బాలాజీ తదితరులు పల్లాకు పుష్పగుచ్ఛం అందజేశారు. - విశాఖపట్నం/అనకాపల్లి- ఆంధ్రజ్యోతి

ఉమ్మడి జిల్లాకు టీడీపీ పెద్దపీట

ముగ్గురికి కీలక స్థానాలు

- స్పీకర్, హోం మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి కట్టబెట్టిన అధినేత చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పదవుల పంపకంలో ఉమ్మడి విశాఖ జిల్లాకు తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు పెద్దపీట వేశారు. ముఖ్యమంత్రి తరువాత ప్రాధాన్యం కలిగిన స్పీకర్ పదవి నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాలయ అయ్యన్నపాత్రుడుకు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వంలో కీలకమైన హోంమంత్రి పదవి పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితకు ఇచ్చారు. అలాగే గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును పార్టీ రాష్ట్ర అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టి విశాఖ జిల్లాపై తన కున్న అభిమానాన్ని చంద్రబాబు చాటుకున్నారు.

టీడీపీ ఆవిర్భావం తరువాత రెండు, మూడు పర్యాయాలు తప్ప విశాఖ జిల్లా ప్రజలు తెలుగుదేశం పార్టీకే అత్యధిక సీట్లు ఇస్తూ వచ్చారు. గత ఎన్నిక ల్లో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ గాలి వీచినా నగరంలోని నాలుగు నియోజక వర్గాల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. అదే విషయాన్ని చంద్రబాబునాయుడు పలుమార్లు ప్రస్తావించేవారు. ఇక ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో మూడు ఎంపీ సీట్లకుగాను రెండు, 15 అసెంబ్లీ స్థానాలకుగాను 13 సీట్లు కూటమి అభ్యర్థులు గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ జిల్లాకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్న ... మిగతా 7వ పేజీలో

అధ్యక్షా...

చింతకాయల అయ్యన్నపాత్రుడుకు అరుదైన గౌరవం

- రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఎంపిక చేసిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు
- విధేయత, సీనియారిటీకి గుర్తింపు
- ఉమ్మడి విశాఖపట్నం నుంచి శాసన సభాపతిగా ఎన్నికైన తొలి నేతగా గుర్తింపు
- ఉత్తరాంధ్ర నుంచి ఐదోవారు...

అనకాపల్లి/నర్సీపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సీనియర్ నేత, మాజీ మంత్రి, నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడుకు కూటమి ప్రభుత్వం సముచిత స్థానం కల్పించనున్నది. ఆయనను రాష్ట్ర శాసనసభ స్పీకర్ పదవికి సీఎం నారా చంద్రబాబునాయుడు ఎంపిక చేశారు. అయ్యన్నపాత్రుడు నాలుగు దశాబ్దాలుగా తెలుగు దేశం పార్టీలో కొనసాగుతూ ఒకసారి ఎంపీగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎన్టీ రామారావు, చంద్రబాబునాయుడు మంత్రివర్గాల్లో పనిచేశారు.



చింతకాయల అయ్యన్నపాత్రుడు

ఉత్తరాంధ్ర నుంచి ఐదో వ్యక్తి...

ఆంధ్రరాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకూ ఉత్తరాంధ్ర నుంచి నలుగురు స్పీకర్ పదవి పొందారు. అయ్యన్నపాత్రుడు ఐదో వ్యక్తి అవుతారు. ఆంధ్ర రాష్ట్రం ర్పాటైన తరువాత రెండేళ్లకు బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో టెక్కలి శాసనసభ్యుడు రొక్కం లక్ష్మీనరసింహందొర (ఆర్‌ఎల్‌ఎన్ దొర) 1955 ఏప్రిల్ 25న స్పీకర్‌గా ఎన్నికయ్యారు. ఆ తరువాత మళ్లీ తెలుగుదేశం హయాంలో 1983 జనవరిలో ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శ్రీకాకుళం శాసనసభ్యుడు తంగి సత్యనారాయణ స్పీకర్ అయ్యారు. అయితే 1984 ఆగస్టు సంక్షోభం సమయంలో సత్యనారాయణ...నాదెండ్ల భాస్కరరావు వర్గంలో చేరడంతో ఆయన పదవి పోయింది. మళ్లీ 1999లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పుడు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఎమ్మెల్యే కావలి ప్రతిభాభారతికి అసెంబ్లీ స్పీకర్‌గా అవకాశం ఇచ్చారు. అసెంబ్లీ చరిత్రలో తొలిసారి మహిళను సభాపతిగా ఎంపిక చేయడం అరుదైన విషయంగా చెబుతారు. ఇక గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస ఎమ్మెల్యే తమ్మినేని సీతారాంకు స్పీకర్‌గా అవకాశం ఇచ్చారు. ఇప్పుడు ఉమ్మడి విశాఖ జిల్లా నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడుకి చంద్రబాబునాయుడును స్పీకర్ పదవికి ఎంపిక చేశారు. ఉత్తరాంధ్ర నుంచి స్పీకరు పదవులు నిర్వహించిన ఐదుగురిలో నలుగురు శ్రీకాకుళం జిల్లాకు చెందినవారు కాగా, ఒకరు ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందినవారు. వీరిలో తంగి సత్యనారాయణ, తమ్మినేని సీతారామ్, చింతకాయల అయ్యన్నపాత్రుడు బీసీ వర్గానికి చెందినవారు.

రాజకీయ ప్రస్థానం ఇలా..

మాజీ ఎమ్మెల్యే రుత్తల లచ్చాపాత్రుడు వారసత్వాన్ని అందిపుచ్చుకున్న అయ్యన్నపాత్రుడు 1983లో తెలుగుదేశం పార్టీలో చేరి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టారు. అతి చిన్న వయస్సులో తంగేడు రాజుల కుటుంబంలో ఒకరైన రాజాసాగి రామచంద్రరాజు మీద ఎమ్మెల్యేగా విజయం సాధించి అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. 1985, 1994, 1999, 2004, 2014లో ఎమ్మెల్యేగా పని చేశారు. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ఘన ... మిగతా 7వ పేజీలో

ప్రమాదాల ప్రయాణం

తాండవ నదిపై కాజ్‌వే లేకపోవడంతో మాసాహెబ్‌పేట గ్రామస్థుల అవస్థలు

- తాత్కాలికంగా సిమెంట్ స్తంభాలతో ఏర్పాటు చేసుకున్న వంతెనపై రాకపోకలు
- నది ఉధృతంగా ప్రవహిస్తే 10 కిలో మీటర్ల మేర చుట్టూ తిరిగి రావలసిందే..



మాసాహెబ్‌పేట సమీపంలో తాండవ నదిపై సిమెంట్ స్తంభాలతో ఏర్పాటు చేసుకున్న వంతెనపై రాకపోకలు సాగిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, జూన్ 17: మండలంలోని మాసాహెబ్‌పేట గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాండవ నది అవతల తమ పొలాలు ఉండడం, నదిపై కాజ్‌వే లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. నదిపై తాత్కాలికంగా సిమెంట్ స్తంభాలతో ఏర్పాటు చేసుకున్న వంతెనపై తప్పనిసరి పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాదమని తెలిసినా గత్యంతరం లేక రాకపోకలు సాగించాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు.

మాసాహెబ్‌పేటలో సుమారు ఆరు వేల మంది జనాభా ఉంటారు. వీరి పొలాలు తాండవ నది అవతల ఉన్నాయి. దీంతో వీరు నిత్యం నది దాటాల్సిందే. అయితే తాండవ నది వర్షాకాలంతో ఉధృతంగా ప్రవహిస్తుంది. నదిపై కాజ్‌వే లేకపోవడంతో గ్రామస్థులు తాత్కాలికంగా సిమెంట్ స్తంభాలతో వంతెనలా ఏర్పాటు చేసుకున్నారు. ప్రమాదమని తెలిసినా గత్యంతరం లేక ద్విచక్ర వాహనాలతో సైతం రాకపోకలు సాగిస్తున్నారు. శ్మశానం కూడా నది అవతల ఉండడంతో దహన సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మాజీ ఎంపీటీసీ సభ్యుడు కంకిపాటి వెంకటేశ్వరరావు, గ్రామస్థులు బొలిశెట్టి అప్పారావు, బొలిశెట్టి రమణ, కొంతం రాము, కొంతం దివాణం, గెడ్డమూరి శ్రీనువాసరావు, వెలుగుల నూకరాజు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. పెంటకోట తీరంలోని సముద్రపు నీరు వెనక్కి రావడంతో ఈ ప్రాంతంలో ఎండాకాలంలో కూడా నిత్యం నీరు ఉంటుందని తెలిపారు. ఈ నదిపై కాజ్‌వే నిర్మించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులను కోరామని, కానీ ఫలితం లేకపోయిందని వాపోయారు. తాండవ నది ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు పొలాలకు వెళ్లాలంటే శ్రీరాంపురం, కేశవరం మీదుగా సుమారు 10 కిలోమీటర్లు ప్రయాణించవలసి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ నదిపై కాజ్‌వే నిర్మించాలని వారు కోరుతున్నారు.

ఏయూలో అరాచకం

- నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రార్ పీహెచ్‌డీ ప్రవేశం
- 2022లో ఎగ్జిక్యూటివ్ కోటాలో ప్రవేశాన్ని పొందిన ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్
- రూ.50 కోట్లు టర్నోవర్ ఉన్న సంస్థలకు మాత్రమే ఎగ్జిక్యూటివ్ కోటాకు అవకాశం
- పీహెచ్‌డీ ప్రవేశం పొందే సమయానికి ఏయూలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా స్టీఫెన్
- అది కూడా మరో ఉల్లంఘన



జేమ్స్ స్టీఫెన్

విశాఖపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ నిబంధనలకు విరుద్ధంగా పీహెచ్‌డీ ప్రవేశాన్ని పొందారు. ఆయన 2022లో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో పీహెచ్‌డీలో చేరారు. కొద్దిరోజుల కిందట ప్రీ పీహెచ్‌డీ పరీక్షల కోసం దరఖాస్తు చేసినప్పుడు.. విభాగాధిపతి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సాధారణంగా ఎగ్జిక్యూటివ్ కోటాలో పీహెచ్‌డీ పట్టా పొందాలంటే కొన్ని నిబంధనలు ఉంటాయి. ఏ సంస్థ నుంచి అయితే ఎగ్జిక్యూటివ్ పీహెచ్‌డీ ప్రవేశం పొందాలనుకుంటున్నారో ఆ సంస్థ టర్నోవర్ కనీసం రూ.50 కోట్లు ఉండాలి. పీహెచ్‌డీ ప్రవేశం పొందే సమయానికి స్టీఫెన్ నగర పరిధిలోని ఒక ఇంజనీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఆ సంస్థ టర్నోవర్ ఆ స్థాయిలో లేకపోయినప్పటికీ ఎగ్జిక్యూటివ్ కోటాలో ఆయనకు పీహెచ్‌డీ ప్రవేశాన్ని కల్పించారు. అదేవిధంగా ఆ ప్రవేశం పొందే సమయానికే స్టీఫెన్ ఏయూ ఎగ్జిక్యూటివ్ ... మిగతా 8వ పేజీలో

హడలెత్తిస్తున్న హాస్టల్

శిథిలావస్థలో వడ్డాది బీసీ బాలుర వసతి గృహం

- ధ్వంసమైన పైకప్పు
- ఊడిపడుతున్న పెంకులు
- గాయాల పాలవుతున్న విద్యార్థులు
- తలుపుల్లేని మరుగుదొడ్లు
- ఎప్పుడు ఏం జరుగుతుందోనని భీతిల్లుతున్న తల్లిదండ్రులు



వడ్డాది బీసీ బాలుర హాస్టల్ భవనం

బుచ్చెయ్యపేట, జూన్ 17: ధ్వంసమైన పైకప్పు.. ఊడిపడుతున్న పెంకులు.. దెబ్బతిన్న ఫ్లోరింగ్, తలుపుల్లేని మరుగుదొడ్లు.. ఇదీ వడ్డాదిలోని వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం దుస్థితి. శిథిలావస్థకు చేరిన ఈ భవనంలో ఉంటున్న తమ పిల్లలకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.



దెబ్బతిన్న హాస్టల్ మొదటి అంతస్థు పైకప్పు

వడ్డాదిలోని వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరింది. 1988లో అద్దె భవనంలో ఈ వసతి గృహం ప్రారంభమైంది. 36 సంవత్సరాలుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. 3 నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం వ సతి గృహం మంజూరు చేశారు. భవనం కింద ఫ్లోర్‌లో నాలుగు, పైఅంతస్థులో నాలుగు గదులు ఉన్నాయి. దశాబ్ద కాలం కిందట భారీ వర్షాలకు భవనం అంతస్థు పెంకులు దెబ్బతిన్నాయి. మరమ్మతులకు నోచుకోకపోవడంతో పైకప్పు దూలాలు వర్షాలకు తడిసి దెబ్బతిన్నాయి. దీంతో పైన నాలుగు గదులు పూర్తిగా కారిపోతున్నాయి. ప్రత్యామ్నాయంగా కింద గదుల్లో విద్యార్థులను సర్దుబాటు చేశారు. మరుగుదొడ్లకు తలుపులు ఊడిపోయాయి. వర్షం నీటికి భవనం గోడలు, తలుపులు, కిటికీలు తడిసిపోతుండడంతో బాగా దెబ్బతిన్నాయి. ప్లాస్టింగ్, ఫ్లోరింగ్ దెబ్బతిన్నాయి. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థుల చేరికలు బాగా తగ్గిపోయాయి. కొన్నిసార్లు భవనం పైకప్పు నుంచి ... మిగతా 8వ పేజీలో



భక్తిశ్రద్ధలతో బక్రీద్

పరవాడ మండలం గొల్లగుంట మసీదులో నమాజ్ చేస్తున్న దృశ్యం

జిల్లాలో సోమవారం బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజ్‌లు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నేడు మాడుగుల మోదకొండమ్మ జాతర

- వార్త 7వ పేజీలో..

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మహిళకు తీవ్ర గాయాలు



లారీ చక్రాల కిందకు వెళ్లిపోయిన బైక్, (ఇన్‌సెట్‌లో) మృతుడు పంపనబోయిన నాని

పాయకరావుపేట, జూన్ 17: స్థానిక తాండవ జంక్షన్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. కాకినాడ జిల్లా అన్నవరం గ్రామానికి చెందిన పంపనబోయిన నాని(25) తన అక్క అనంతతో కలిసి సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై అన్నవరం నుంచి నక్కపల్లి వైపు బైక్‌పై వెళుతున్నారు. పాయకరావుపేటలోని తాండవ జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో పక్క నుంచి వెళుతున్న లారీ చక్రాల కిందకు వారి బైక్ వెళ్లిపోయింది. దీంతో ద్విచక్రవాహనం నడుపుతున్న నాని అక్కడికక్కడే మృతిచెందగా, వెనుక కూర్చున్న అతని అక్క అనంతకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని, తీవ్ర గాయాలైన మహిళను తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, పాప ఉన్నారని తెలుస్తోంది. కాగా ప్రమాదానికి సంబంధించి ఇంకా పిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

క్రైం... crime news

దాడిలో గాయపడిన ఆటో డ్రైవర్ మృతి


కసిపల్లి రాంబాబు (ఫైల్‌ఫొటో

రోలుగుంట, జూన్ 17: లారీ డ్రైవర్ దాడిలో గాయపడిన ఆటో డ్రైవర్ మృత్యువాతపడ్డారు. దీని పై స్థానిక ఎస్ఐ సురేష్ అందించిన వివరాలివి.. కొమరవోలు గ్రామానికి చెందిన కసిపల్లి రాంబాబు (58) ఈ నెల 15న మధ్యాహ్నం నర్సీపట్నం నుంచి రోలుగుంటకు ఆటోను నడుపుకుంటూ వస్తున్నాడు. ఇదే సమయంలో కె.నాయుడుపాలెం గ్రామానికి చెందిన డ్రైవర్ గుములూరు రమణబాబు లారీతో వస్తూ రోలుగుంట హిమనీ స్టోన్ క్రషర్ సమీపంలో ఓవర్ టెక్ చేసే ప్రయత్నంలో ఆటోను రాసుకుంటూ క్రషర్‌లోకి వెళ్లిపోయాడు. ఈ ఘటనలో ఆటో అద్దం ధ్వంసం కావడంతో డ్రైవర్ రాంబాబు లారీ డ్రైవర్ రమణబాబును ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో లారీ క్యాబిన్‌లో ఉన్న ఇనుప రాడ్డుతో రమణబాబు దాడి చేయడంతో రాంబాబుకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ వెంటనే రమణబాబు పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న రాంబాబు స్థానికులు చూసి ఆయనబంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు అతనిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్సకు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం రాంబాబు మృతిచెందాడు. మృతుని భార్య మణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. సోమవారం ఉదయం అనకాపల్లి డీఎస్పీ ఎస్.అప్పలరాజు, సీఐ అప్పలనాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పరారైన నిందితుడిని అరెస్టు చేస్తామని తెలిపారు. అలాగే, దళిత సంఘాల నాయకులు గారా ఈశ్వరరావు, కిడారి మల్లేశ్వరరావులు డీఎస్పీని కలిసి నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడు (ముసుగులో ఉన్న వ్యక్తి)తో ఏఎస్పీ కె.ధీరజ్, సీఐ, ఏఎస్‌లు

పాడేరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్టు ఏఎస్పీ కె.ధీరజ్ తెలిపారు. సీఐ డి.నవీన్‌కుమార్, ఎస్ఐ జి.లక్ష్మణరావుతో కలిసి సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. మోదకొండమ్మ ఉత్సవాలకు వచ్చిన బాలికపై ఈ నెల 10న అర్ధ రాత్రి ఆరేళ్ల అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు చెప్పారు. రెండు బృందాలతో నిందితుడి ఆచూకీ కోసం గాలింపులు చేపట్టారన్నారు. సీసీ కెమెరాల్లోని పుటేజీలు, బాధితురాలైన బాలిక చెప్పిన ఆనవాళ్ల ఆధారంగా తమ సిబ్బంది ఘాట్‌లోని 12వ మైలు గ్రామం సమీపంలో సోమవారం నిందితుడ్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారన్నారు. విచారణలో బాలికపై అతనే అత్యాచారానికి ఒడిగట్టాడని నిర్ధారణ జరిగిందన్నారు. ఇందుకు కృషి చేసిన సీఐ, ఎస్ఐ, క్రైమ్ సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

పాముకాటుతో రైతు మృతి


మృతిచెందిన రామునాయుడు

చీడికాడ, జూన్ 17: మండలంలో తురువోలు గ్రామానికి చెందిన గుల్లిపల్లి రామునాయుడు (72) పాముకాటుతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందారు. ఎస్ఐ జి.నారాయణరావు తెలిపిన వివరాలివి.. రామునాయుడును ఈనెల 10వ తేదీ ఉదయం పొలంలో పనిచేస్తుండగా పాము కాలిపై కాటువేసింది. వెంటనే కుటుంబ సభ్యులు చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ఆయన కుమారుడు అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్టు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంలో విద్యార్థి మృతి


మృతుడు జీవన్ మగర్

కె.కోటపాడు, జూన్ 17: మండలంలోని కింతాడ గ్రామంలో సోమవారం కవనెంట్ ఇంటర్ నేషనల్ బైబిల్ కాలేజీలో విద్యుదాఘాతానికి లోనై జీవన్‌మగర్ సన్ ఆఫ్ ఉమేష్‌కుమార్ అనేవిద్యార్థి మృతి చెందాడు. జీవన్ మగర్ వాటర్ ట్యాంకు మోటార్ పట్టుకోవడంతో షాక్‌కు గురై పక్కనే ఉన్న ట్యాంక్‌లో పడిపోయాడు. పక్కనే ఉన్న మెల్లం ప్రదీప్ సాగర్ అతనిని పైకి తీశాడు. వెంటనే కాలేజీ యాజమాన్యం జీవన్ మగర్‌ను కె.కోటపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు జీవన్ మగర్ నేపాల్ నుంచి వచ్చి 2017లో సీఐబీసీలో ఎండీవీ కోర్సులో చేరారు. అప్పటి నుంచి కాలేజీలో హాస్టల్‌లో ఉంటూ అప్పుడప్పుడు సెలవులకు ఇంటికి వెళ్తూ ఉండేవాడని కళాశాల యాజమాన్యం తెలిపింది. అతను కోర్సు పూర్తి చేసుకొని నేపాల్ వెళ్లడానికి జూలై 15కి రిజర్వేషన్ చేయించుకున్నాడని ఇంతలోనే ఈ ప్రమాదం జరిగినట్టు విచారం వ్యక్తంచేశారు. మెల్లం ప్రదీప్‌సాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి


శ్యామలరావు (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, జూన్ 17 : విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ అనకాపల్లి మోటార్ సైకిళ్ల మెకానిక్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎదురేశ్వరపు శ్యామలరావు (72) ఆదివారం మృతి చెందారు. ఈ మేరకు సోమవారం మృతుని సోదరుడు వీరబ్రహ్మం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆనంద్ తెలిపారు. శ్యామలరావు సబ్బవరం రోడ్డులోని సుంకరమెట్ట జంక్షన్ సమీపంలో నివాసం ఉంటున్నారు. ఈనెల ఎనిమిదో తేదీన పాము కాటేయడంతో అనకాపల్లిలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. శ్యామలరావు మృతి పట్ల అసోసియేషన్ సభ్యులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మెకానిక్ దుకాణాలను సోమవారం మూసివేసి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

అనకాపల్లి టౌన్, జూన్ 17 : స్థానిక విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి రైల్వే ట్రాక్‌పై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గుర్తించామని సోమవారం దువ్వాడ జీఆర్‌పీ ఎస్ఐ కె.శాంతారామ్ తెలిపారు. మృతుని వయసు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటుందని, 5.2 అడుగుల ఎత్తు ఉన్నాడని తెలిపారు. నీలం కలర్ లుంగీ, నీలం కలర్ గళ్ల షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే ట్రాక్ మధ్యలో మృతదేహం తలకు బలమైన గాయాలై ఉన్నాయని వివరించారు. మృతుడు వివరాలు తెలిసినట్టయితే దువ్వాడ జీఆర్‌పీ ఎస్ఐ సెల్‌నంబరు 7673906010కు సంప్రదించాలని ఆయన కోరారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	128.00
లైవ్ ధర	148.00
విత్ స్కిన్	266.00
స్కిన్ లెస్	276.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

నిరుపయోగంగా సంపద కేంద్రాలు

- పంచాయతీలకు ఆదాయం కోసం సంపద కేంద్రాలు ఏర్పాటు
- వైసీపీ ప్రభుత్వం రాకతో మూలకు చేరిన వైనం
- మందుబాబులకు అడ్డాగా మారిన కేంద్రాలు
- వినియోగంలోకి తీసుకురావాలని నూతన ప్రభుత్వానికి వినతి


నిరుపయోగంగా ఉన్న లాలంకోడూరు సంపద కేంద్రం

రాంబిల్లి, జూన్ 17 : తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఈ కేంద్రాలు మందుబాబులకు అడ్డాగా తయారయ్యాయి. అయినా సంబంధిత అధికారులు వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే..

మండలంలో 13 పంచాయతీలలో సంపద కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో సంపద కేంద్రం నిర్మాణానికి రూ.6 లక్షల నుంచి రూ.8


తుప్పల్లో సంతపాలెం సంపద కేంద్రం

లక్షల వరకు ఖర్చు చేశారు. ఈ సంపద కేంద్రాలను కొద్ది రోజులు తూతూ మంత్రంగా నిర్వహించి వదిలేశారు. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తలను పారిశుధ్య కార్మికులు సంపద కేంద్రాలకు తరలించి, అక్కడ ఎరువుగా తయారు చేయాలి. ఆ విధంగా తయారు చేసిన ఎరువును రైతులకు విక్రయించి పంచాయతీలకు ఆదాయం సమకూర్చేందుకు టీడీపీ ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. అయితే 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. గత ఐదేళ్లుగా ఇవి పూర్తిగా వినియోగంలో లేకపోవడంతో మందుబాబులకు, అశ్లీల కార్యక్రమాలకు నిలయాలుగా తయారయ్యాయి. దిమిలి, లాలంకోడూరు, పంచదార్ల, గోవిందపాలెం తదితర గ్రామాల్లో ఉన్న సంపద కేంద్రాలు మందుబాబులకు నిలయాలుగా మారాయి. ప్రతి రోజూ మందుబాబులు ఈ సంపద కేంద్రాలలో మద్యం సేవిస్తూ అక్కడే సీసాలను వదిలి వెళ్లిపోతున్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేడు మాడుగుల మోదకొండమ్మ జాతర


మోదకొండమ్మ అమ్మవారు


ఆలయం బయట లోపల బంతిపూలతో అలంకరించిన దృశ్యం

మాడుగుల, జూన్ 17: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి జాతర మంగళవారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి కమిటీ ఆ ధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. గ్రామ నలుమూలలా విద్యుత్ దీపాలంకరణ చేశారు. మంగళవారం ఉదయం వేకువజాము ఆరు గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులు, ఇళ్లవద్ద పూజించిన ఘటాలతో ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లిస్తారు. ఎండల దృష్ట్యా భక్తులకు వడదెబ్బ తగలకుండా ఆలయం ఎదుట టెంట్‌లు ఏర్పాటు చేశారు. అలాగే, క్యూలైన్ల కోసం బారికేడ్లు ఏర్పాటు చేశారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు, మజ్జిగ చలివేంద్రాలు, ప్రసాద వితరణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ అప్పలరాజు మాట్లాడుతూ ఈసారి జాతరకు భారీగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నామన్నారు.

150 మంది పోలీసులతో బందోబస్తు : ఎస్ఐ

జాతర ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా జాతరలో 150 మంది పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఘాట్‌రోడ్డు మీదుగా వచ్చే వాహనాలు తెల్లవారుజాము నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మళ్లిస్తున్నట్టు వివరించారు. అలాగే, ఎం కోడూరు మీదుగా మాడుగుల వచ్చే వాహనాలను ఆలయం వెనక భాగం నుంచి మళ్లించనున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదేశాల మేరకు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన వీఐపీలను దర్శనం అనంతరం తిరిగి బస్టాండ్ మీదుగా రాకుండా వయా కోడూరు మీదుగా పంపించనున్నట్టు పేర్కొన్నారు.

ఎలమంచిలి డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణకు చర్యలు

- ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్
- మునిసిపాలిటీలో డ్రైనేజీలు, సాగు నీటి కాలువల పరిశీలన


యానాద్రి కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి, జూన్ 17 : ఎలమంచిలి మునిసిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. మునిసిపాలిటీలో సోమవారం తొలిసారిగా పర్యటించిన ఎమ్మెల్యే విజయకుమార్‌కు మునిసిపల్ కార్యాలయం వద్ద స్థానిక నేతలు, మునిసిపల్ అధికారులు పుష్పగుచ్ఛాలిచ్చి గజమాలతో సత్కరించారు. అనంతరం ద్విచక్ర వాహనంపై టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, మునిసిపల్ అధికారులతో కలిసి పట్టణ డ్రైనేజీ వ్యవస్థతో పాటు సాగునీటి కాలువలను పరిశీలించారు. తొలుత తులసీనగర్, ఎన్టీఆర్ కాలనీ, నాగేంద్ర కాలనీ, కొత్తపేట కాలనీల మీదుగా పయనిస్తున్న డ్రైనేజీలు, సాగునీటి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా మిలట్రీ కాలనీకి చేరుకున్న ఎమ్మెల్యేకు టీడీపీ నేత దత్తాత్రేయ మొక్కను జ్ఞాపికగా అందజేశారు. పట్టణ డ్రైనేజీ వ్యవస్థ ప్రారంభం నుంచి ఔట్‌ఫ్లో వరకు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఎమ్మెల్యే సుందరపు మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్టు చెప్పారు. ఆదివారం అచ్యుతాపురంలోను, సోమవారం ఎలమంచిలిలో పర్యటించానన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. పట్టణంలో గత 20 సంవత్సరాలకుపైగా డ్రైనేజీ వ్యవస్థ దయనీయంగా ఉందన్నారు. వర్షాలు పడిన సమయంలో పట్టణంలో చాలా ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, వీటికి శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ కారణంగా దోమల వ్యాప్తి పెరిగిపోతున్నాయన్నారు. కొత్తపేటలో న్యాయవాది శ్రీనివాస పట్నాయక్ యానాద్రి కాలువ పరిస్థితిని ఎమ్మెల్యేకు వివరించారు. లొట్లవారి వీధిలో మహిళలు ఇదే సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణలో నివాసితులకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. వార్డుల్లో ఎమ్మెల్యేకు మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సమస్యలను స్థానికులను అడిగి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. అనంతరం మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ప్రభాకరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు తదితరులతో సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ పట్టణ అధ్యక్షులు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, కూటమి పార్టీల నేతలు కొఠారు సాంబ, పిట్టా శ్రీను, లవుడు లోవరాజు, కొఠారు నరేష్, ఆదిమూర్తి, లంక రాజు, బొద్దపు శ్రీను(రమణ), పల్లా సత్యనారాయణ, కరణం రవి, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షా...

... 5వ పేజీ తరువాయి

విజయం అందుకున్నారు. 29 సంవత్సరాల వయస్సులో తెలుగుదేశం వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు క్యాబినెట్‌లో అయ్యన్నపాత్రుడుకి మంత్రిగా పనిచేసే అవకాశం లభించింది. తొలిసారి 1985 నుంచి 87 వరకు సాంకేతిక విద్యా శాఖ మంత్రిగా చేశారు. 1994 నుంచి 1996 వరకు రోడ్లు, భవనాల శాఖ, 1999 నుంచి 2004 వరకు అటవీ శాఖ, 2014 నుంచి 2017 వరకు పంచాయతీరాజ్ శాఖ, 2017 నుంచి 2019 వరకు ఆర్ అండ్ బీ శాఖా మంత్రిగా పనిచేశారు. 1996లో జరిగిన అనకాపల్లి పార్లమెంట్ నియోకవర్గం ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు.

అయ్యన్నపాత్రుడు తండ్రి చింతకాయల వరహాలదొర స్వగ్రామం తూర్పు గోదావరి జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి. నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే రుత్తల లచ్చాపాత్రుడుకి వారసులు లేకపోవడంతో కూతురు చెల్లయ్యమ్మను వరహాలదొరకు ఇచ్చి వివాహం చేసి ఇల్లరికపు అల్లుడుగా చేసుకున్నారు. వరహాలదొర, చెల్లయ్యమ్మ మొదటి సంతానమైన అయ్యన్నపాత్రుడు విద్యాభ్యాసమంతా నర్సీపట్నంలోనే కొనసాగింది. నర్సీపట్నం జూనియర్ కళాశాలలో ఇంటర్ వరకు చదువుకొని, కాకినాడలో బీఏ డిగ్రీ పూర్తిచేశారు. చదువు పూర్తయిన తరువాత తాత లచ్చాపాత్రుడు రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న అయ్యన్నపాత్రుడు 1983 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కొత్తూరు, జూన్ 17 : ఈనెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడని అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వై.సోంబాబు సోమవారం తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి మండలం బవులవాడ రిక్షా కాలనీకి చెందిన గొర్లి మహలక్ష్మినాయుడు (73) ఈనెల 11న సాయంత్రం 5.30 గంటలకు తుమ్మపాల గ్రామానికి కూరగాయలు కొనుగోలు చేసేందుకు సైకిల్‌పై వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తున్న సమయంలో ప్రధాన రోడ్డు దాటుతుండగా అనకాపల్లి నుంచి చోడవరం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మహలక్ష్మినాయుడు తలకు తీవ్రంగా గాయమవడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. సోమవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడని అతని కుమారుడు గొర్లి నరసింగరావు ఫిర్యాదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ సోంబాబు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతుడికి భార్య బుల్లమ్మ ఉంది.

బైక్ కొనలేదని యువకుడి ఆత్మహత్య


దుర్గారావు (ఫైల్)

నక్కపల్లి, జూన్ 17: బైక్ కొనలేదని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన మండలంలోని గొడిచెర్లలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని గొడిచెర్లలో ఈనెల 15న పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందినట్టు పోలీసులు చెప్పారు. గొడిచెర్ల గ్రామానికి చెందిన లోలి దుర్గారావు (18) గత కొన్ని రోజుల నుంచి బైక్ కొనమని తల్లిదండ్రులను అడుగుతున్నాడని వారు చెప్పారు. బైక్ కొనలేదని ఈనెల 15న పురుగుల మందు తాగి, ఇంటికి వచ్చి పడిపోగా తల్లిదండ్రులు తుని ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందినట్టు పోలీసులు చెప్పారు.

పైనాపిల్ రూ. 25



మాడుగుల, జూన్ 17: ఏజెన్సీ గిరిజన ప్రాంత రైతులు అనాసపనాస పండ్లను సోమవారం మాడుగులలోని వారపు సంతకు విరివిగా తీసుకువచ్చారు. కందులపాలెం, ఈదులపాలెం, దేవాపురం, సలుగు, పులుసుమామిడి, కక్కి, వంట్లమామిడి, చింతగరువుతదితర ప్రాంతాలనుంచి ఈ ఫలాలను నెత్తి బరువు, కావిళ్లతోపాటు వాహనాలపై తీసుకువచ్చారు. పెద్ద సైజులో ఉన్న పండు రూ. 25కు, చిన్నసైజు ఫలాలు రూ. 18 నుంచి రూ. 20లకు విక్రయించారు. అలాగే, పనస ఒక్కో పండు సైజు ఆధారంగా రూ.100 నుంచి రూ. 150 వరకు అమ్ముడయ్యాయి.

ఏజెన్సీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు వినతి


రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు వినతిపత్రం ఇస్తున్న జిల్లా నాయకులు

అనకాపల్లి టౌన్, జూన్ 17: విశాఖ ఏజెన్సీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయించాలని యూటీఎఫ్ జిల్లా నాయకులు కోరారు. సోమవారం నెల్లూరులో జరిగిన ఒక కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్‌లను వారు కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. జీవో నంబరు 117 అమలులోకి రావడంతో సుమారు 400 మంది ఉపాధ్యాయులు ఏజెన్సీకి బదిలీ అయ్యారని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి వివరించారు. వీరిలో ఎక్కువగా మహిళా ఉపాధ్యాయులు, పదవీవిరమణకు దగ్గరగా ఉన్నవారు ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీ ప్రకటించడం హర్షణీయమన్నారు. మెగా డీఎస్సీలో పేర్కొన్న ఖాళీల్లో ఏజెన్సీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాల్లోకి బదిలీ చేసే విధంగా రాష్ట్ర నాయకులు కృషిచేయాలని కోరారు. ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని రాష్ట్ర నాయకులు చెప్పినట్టు చినబ్బాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శిలు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్, అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీవో 117 రద్దు చేయాలి...

- ఎమ్మెల్సీ రఘువర్మ


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ, ఏపీటీఎఫ్ యూనియన్ నాయకులు

బుచ్చెయ్యపేట, జూన్ 17: ప్రాథమిక పాఠశాలల మనుగడకు ముప్పుగా మారిన జీవో 117 రద్దు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.వెంకటపతి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్ కోరారు. వారు సోమవారం వడ్డాదిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతేడాది 3,4,5 తరగతుల విలీనంతోప్రాథమిక పాఠశాలలు త్వరలో మూతపడే స్థితికి చేరాయని ఆందోళన వ్యక్తంచేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చేర్చుతున్నారన్నారు. ఈ ఏడాదిలో ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు తగ్గడానికి గత ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు.ఉపాధ్యాయులపై అనవసరమైన ఒత్తిళ్లకు గురిచేసి, బెదిరించడం వల్ల మెరుగైన ఫలితాలు రావని అధికారులు గుర్తించాలన్నారు. బోధనేతర పనులు అప్పజెప్పడంతో చిన్నారులకు బోధనకు నష్టం కలుగుతుందన్నారు. ఈ స్థితిలో ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చేసిన ఉపాధ్యాయులను మైదాన ప్రాంతానికి పంపించాలని కోరారు. కేజీబీవీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్‌ని అమలు చేయాలని, మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా మాదిరిగా సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని, రెసిడెన్షియల్ స్కూల్‌లోని ఉపాధ్యాయులకు 62 ఏళ్ల సర్వీస్‌ను పొడిగించాలని, మెగా డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ కార్యదర్శి కొటాన శ్రీనివాస్ పాల్గొన్నారు.

హత్యాయత్నం నిందితులపై చర్యలు తీసుకోండి

- అల్లూరి జిల్లా ఎస్పీకి హోంమంత్రి అనిత ఆదేశం

విశాఖపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై హత్యాయత్నం చేసిన నిందితులపై తక్షణం చర్యలు తీసుకోవాలని అల్లూరి సీతారామ రాజుజిల్లా ఎస్పీ తుహీన్‌సిన్హాను హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. సర్క్యూట్‌హౌస్‌లో ఉన్న హోంమంత్రిని అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం కుసుమగుడ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అగతంబిడి చిన్నబాబు సోమవారం కలిసి తనపై హత్యాయత్నం జరిగినట్టు కేసు నమోదుచేసినా నిందితులపై ఇంతవరకూ చర్యలు తీసుకోలేదని ఫిర్యాదుచేశారు. ఈనెల ఎనిమిదిన తాను కుటుంబంతో కలిసి స్వగ్రామానికి వెళ్తుండగా అరకు వైసీపీ సర్పంచ్ భర్త, ఉపాధ్యాయుడు అయిన జి.రాము తన అనుచరులతో కలిసి కత్తులు, ఇనుపరాడ్లతో హత్యాయత్నం చేశారన్నారు. తనకు తీవ్రమైన గాయాలు కావడంతో రక్తస్రావం జరిగి ఆస్పత్రిలో చేరానన్నారు. దీనిపై డుంబ్రిగుడ పోలీసులకు ఫిర్యాదుచేయడంతో హత్యాయత్నం కింద కేసు నమోదుచేసినా, ఇంతవరకూ చర్యలు తీసుకోలేదన్నారు. వైసీపీ నేతలతో అక్కడి ఎస్ఐ అంటకాగుతూ వారి ఆదేశాల మేరకు నిందితులపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. దీంతో హోంమంత్రి అనిత అక్కడి నుంచి ఏఎస్ఆర్‌జిల్లా ఎస్పీకి ఫోన్‌చేసి తక్షణం నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విశాఖ ఎయిర్‌పోర్టులో మంత్రులకు ఘన స్వాగతం

విశాఖపట్నం, జూన్ 17: మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారి విశాఖ విచ్చేసిన కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు సోమవారం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఉదయం పది గంటలకు విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో మంత్రులిద్దరూ విశాఖ చేరుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం, విశాఖ జిల్లాలకు చెందిన వేలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎయిర్‌పోర్టుకు చేరుకుని రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులకు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి శ్రీకాకుళం ర్యాలీగా బయలుదేరిన వారిని గజమాలతో సత్కరించారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు టీడీపీ పెద్దపీట

... 5వ పేజీ తరువాయి

చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో పాయకరావుపేట ఎమ్మెల్యే అనితకు చోటు కల్పించారు. మంత్రివర్గంలో స్థానం ఉంటుందని భావించిన అయ్యన్నపాత్రుడుకు శాసనసభాపతిగా అవకాశం ఇస్తున్నారు. రాష్ట్రంలో అత్యధిక మెజారిటీ సాధించిన పల్లా శ్రీనివాసరావుకు రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగించారు. జిల్లాకు కీలక పదవులు దక్కడం పట్ల పార్టీ నేతలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే కాదు.. సంక్షేమానికి ప్రాధాన్యం : మంత్రి అనిత



హోంమంత్రిని కలిసిన పీఆర్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

నక్కపల్లి/కోటవురట్ల, జూన్ 17: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలోనే కాకుండా వారి సంక్షేమానికి కూడా తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సత్తిబాబు, డీ సీతారామరాజు నేతృత్వంలో పలువురు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సోమవారం హోం మంత్రి అనితను మర్యాదపూర్వకంగా కలిశారు. వారితో అనిత మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలు ఏమైనా వుంటే వినతిపత్రం అందజేస్తే, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. ప్రజలతోపాటు, ఉద్యోగులు కూడా ఈ ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించడంతో కూటమికి అనూహ్య విజయం దక్కిందన్నారు. హోం మంత్రిని కలిసిన వారిలో ఉద్యోగ సంఘ ప్రతినిధులు రమణబాబు, నరసింగరావు, గంగాధర్, సత్యనారాయణ, త్రినాద్‌స్వామి, పీవీఎస్‌మూర్తి, పరదేశినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామచంద్ర ఆలయ వార్షికోత్సవం

పాయకరావుపేట రూరల్, జూన్17: మండలంలోని సత్యవరం ఎస్సీ కాలనీలో సీతారామచంద్రస్వామి ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర శ్రీరామ హోమం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రామ్‌పిల్ల అచ్యుతరావు, కూలి నానాజీ, సమరసతా సేవా ఫౌండేషన్ ప్రతినిధులు తాడి సూరిమూర్తి, పోతు రంగారావు, మేడిశెటి దివాణం, చేపల అప్పలరాజు, ఖండ సంయోజక్ నీలాపు వెంకటరెడ్డి, ఖండ ధర్మప్రచారక్ కట్టా వీరబాబు పాల్గొన్నారు.

వరి విత్తనాలు సిద్ధం

అచ్యుతాపురం, జూన్ 17: మండలంలో 150 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బి. శంకర్ గోవింద్ తెలిపారు. శ్రీకాకుళం సన్నాలు క్వింటాలు ధర రూ.1,257 కాగా రాయితీ పోను రూ.987కి ఇస్తున్నామన్నారు. సాంబ మసూరు రాయితీ పోను రూ.795, ఎంటీయూ 1061 రకం రూ.894. ఎంటీయూ 1318 రకం రూ.894, ఎంటీయూ 1224 రకం రూ.795లకు ఇస్తున్నామన్నారు.

ఎమ్మెల్యే విజయకుమార్‌కు అభినందనలు



విజయకుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న గ్రంథాలయాధికారులు

అచ్యుతాపురం, జూన్ 17: ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు నియోజకవర్గంలోని గ్రంథాలయాధికారులు అచ్యుతాపురంలో గల జనసేన కార్యాలయంలో సోమవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వి.ఆనంద్ (ఎలమంచిలి), ఎల్‌పీ రమణ (మునగపాక), డి. కోటేశ్వరరావు (అచ్యుతాపురం), ఎస్. శకుంతల (దిమిలి) ఉన్నారు.

కృష్ణంపాలెంలో టీడీపీ విజయోత్సవాలు



కృష్ణంపాలెంలో టీడీపీ విజయోత్సవ ర్యాలీ

రాంబిల్లి, జూన్ 17: మండలంలోని కృష్ణంపాలెంలో సోమవారం టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కశిరెడ్డి ప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్‌ను కట్ చేశారు. అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సీఎం రమేశ్‌ను కలిసిన జేఎన్‌పీసీ మ్యాన్‌ఫ్యాక్చర్ అసోసియేషన్ సభ్యులు



ఎంపీ సీఎం రమేశ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

పరవాడ, జూన్ 17 : అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ (జేఎన్‌పీసీ) మ్యాన్‌ఫ్యాక్చర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు సోమవారం తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీకి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కమిటీ సభ్యులు సీహెచ్. నరసింహరావు, బి.రామకృష్ణ, జె. సుబ్బారావు, కమలాకరరావు, ఎం. పాపయ్యదొర, ఎం.శివరామప్రసాద్, ప్రసాద్‌రాజు, అప్పారావు పాల్గొన్నారు.

అనకాపల్లి అభివృద్ధికి కట్టుబడి ఉన్నా : ఎంపీ సీఎం రమేశ్

కొత్తూరు, జూన్ 17 : అనకాపల్లి అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రైవేటు కన్వెన్షన్ హాలులో బీజేపీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఉత్తరాంధ్రలో ఉన్న 5 పార్లమెంటు స్థానాల్లో అనకాపల్లి నుంచి తాను అత్యధిక మెజారిటీతో గెలవడం పట్ల ఆనందంగా ఉందన్నారు. ఈ విజయాన్ని అందించిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కేవలం ఈ విజయంతో ఆగిపోకుండా జిల్లాలో ఉన్న ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ, మున్సిపాలిటీలలో సైతం బీజేపీ గెలవడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి ఒక్క కార్యకర్తకూ తగిన గుర్తింపు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ బీజేపీ పటిష్టతకు, నిర్మాణానికి మరింత కృషి చేయాలన్నారు. ఎంపీ సీఎం రమేశ్ సహకారంతో బీజేపీని విస్తరించాలని నరేంద్రమోదీ, అమిత్‌షా సూచించినట్టు చెప్పారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పొన్నగంటి అప్పారావు, సురేంద్రమోహన్, పుట్టా గంగయ్య, శ్రీరామమూర్తి, రెడ్డి పావని, బీజేపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్

అందరి సహకారం తీసుకుంటా : సుందరపు

అచ్యుతాపురం, జూన్ 17: అందరి సహకారం తీసుకుంటానని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ విదసం నేతలతో అన్నారు. సోమవారం దిమిలి సర్పంచ్ సేనాపతి నాగేశ్వరరావు నేతృత్వంలో ఎలమంచిలి జోన్ విదసం నేతలు విజయకుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ విదసం సామాజిక అజెండాలో జగన్‌పై రాజీలేని పోరాటం చేసిందన్నారు. మా పథకాలకు సమాధి చేసిన విషయం, కోడికత్తి కేసు, డెడ్ బాడీ డోర్ డెలివరీ అన్నింటిపై విదసం పోరాడిందన్నారు. సమస్యల పరిష్కారంపై కొత్త ప్రభుత్వం దృష్టిసారించాలన్నారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని విజయకుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టేకు జోగారావు, ఎ. త్రిమూర్తులు, రేబాక భాస్కరరావు, ఎం.నానాజీ, పాము అప్పారావు, పి.జనార్దనరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విజయకుమార్‌ని కలిసిన విదసం నేతలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

అనకాపల్లి టౌన్, జూన్ 17 : జిల్లాలో ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండగను జరుపుకున్నారు. అనకాపల్లి పట్టణంలోని చిననాలుగురోడ్ల జంక్షన్ మసీదువీధిలో గల జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు హుస్సేన్ ఆధ్వర్యంలో మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలంతా తమ ఆచారంలో భాగంగా ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిలానీ, అన్వర్, ఉమర్, భాషా తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో.. స్థానిక నూరీ మసీదులో బక్రీద్ వేడుకలు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె. రెహ్మాన్ (బాబర్) ఆధ్వర్యంలో సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముస్లింలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలియజేశారు. తెల్లవారుజాము నుంచి మసీద్‌లో మత పెద్దలు పలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బాబర్ మాట్లాడుతూ బక్రీద్ వేడుకలు త్యాగానికి గుర్తుగా నిర్వహించుకుంటామని, ఈ పండుగ సమాజంలోని వివిధ వర్గాల మధ్య జాలి, దయ, కరుణ అనే స్ఫూర్తిని నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నూరీ మసీదు అధ్యక్షుడు ఎస్.సయ్యద్ రెహంతుల్లా, కార్యదర్శి ఎస్ఎంఎం.అలీ, ఎంఏ.రెబ్బాని, ఇంతియాజ్, అన్వర్, సలీం, నయీమ్, సఫీ తదితరులు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పరవాడలో.. మండల వ్యాప్తంగా సోమవారం బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం మసీదులు, ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గొల్లగుంట మసీదులో ముస్లిం మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ధార్మికోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పరవాడ, ఎన్టీపీసీ, వాడచీపురుపల్లి, గొల్లగుంట తదితర గ్రామాల్లో బక్రీద్ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు.

ఎలమంచిలిలో.. పట్టణంలో సోమవారం ముస్లిం సోదరులంతా బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని క్లబ్ రోడ్డు సమీపంలో ఉన్న ఈద్‌గా వద్దకు పెద్ద సంఖ్యలో ముస్లింలంతా చేరుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఈద్‌గా వద్ద ముస్లిం మత గురువు ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు దానం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా రేగుపాలెంలో ముస్లింలంతా బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

నక్కపల్లిలో.. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని పెదబోదిగల్లం, చినబోదిగల్లం, అప్పలపాయకరావుపేట, పెదదొడ్డిగల్లు, గ్రామాల్లో ముస్లింలు కోలాహలంగా బక్రీద్ పండుగను జరుపుకున్నారు. పెదబోదిగల్లం, పెదదొడ్డిగల్లు మసీదులు, ఈద్‌గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్ద సర్కాజీ మహబూబ్ రహమాన్ తదితరులు బక్రీద్ విశిష్టత గురించి వివరించారు.



కశింకోట నూరీమసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు



అచ్యుతాపురంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

పాయకరావుపేటలో.. పట్టణంలో ముస్లిం సోదరులు బక్రీద్‌ను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే పలువురు ముస్లిం సోదరులు నూతన వస్త్రాలు ధరించి బంధువులు, స్నేహితులను కలిసి ఈద్ ముబారక్ తెలిపారు. బక్రీద్‌కు సూచికగా బలిదానం చేసి ముస్లిం పెద్దలతో స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అచ్యుతాపురంలో.. బక్రీద్ పండగను ముస్లిం సోదరులు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్టూరు రోడ్డులోని మసీదులో సోమవారం ఉదయం ప్రార్థనలు నిర్వహించారు. అచ్యుతాపురంతో పాటు రాంబిల్లి, పరవాడ మండలాల నుంచి ముస్లింలు వచ్చి ఇక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నిప్పులు చెరిగిన భానుడు

పరవాడ, జూన్ 17 : మండల కేంద్రంలో సోమవారం భానుడు నిప్పులు చెరిగాడు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగింది. ఈ కారణంగా ఉదయం 11 గంటలకే ప్రధాన రహదారులపై జన సంచారం లేక నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఎండతో పాటు వేడిగాలులు వీయడంతో ప్రజలు అల్లాడిపోయారు. జూన్ నెల ముగుస్తున్నా.. ఎండ తీవ్రత తగ్గకపోవడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎండ కారణంగా నిత్యం రద్దీగా ఉండే పరవాడ ప్రధాన రహదారి జనసంచారం లేక నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది. అలాగే స్థానిక వ్యాపార కేంద్రాలు కూడా వెలవెలబోయాయి. సింహాద్రి ఎన్టీపీసీ, ఫార్మాసిటీ తదితర ప్రాంతాల్లో కూడా ఎండ తీవ్రత కొనసాగింది.

అనకాపల్లి టౌన్‌లో.. వర్షాలు కురిసి వాతావరణం చల్లబడాల్సిన సమయంలో ఉష్ణోగ్రతలు రోజు పెరుగుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గత మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. దీనికితోడు వడగాడ్పులు కూడా వీయడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మహిళలు నెత్తి పై చెంగులు వేసుకుని ఎంత వేగంగా గమ్యస్థానాలకు చేరుకోవాలా అనే ఆత్రుత పడ్డారు. సాయంత్రం ఐదు గంటలు దాటినా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టకపోవడంతో ఇళ్లల్లో ఉన్నవారు సైతం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఫ్యాన్ కింద కూర్చున్నా చెమటలు పట్టే పరిస్థితుల్లో ఉష్ణోగ్రతలు ఉండడంతో పిల్లలు, వృద్ధులు, బాలింతలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం వేళల్లో ప్రధాన రహదారుల్లో జనసందడి బాగాతగ్గింది. ఒక పక్క పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని ప్రచారం జరుగుతుండగా మరో పక్క ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఇబ్బందులు పెడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.



నిర్మానుష్యంగా ఉన్న పరవాడ ప్రధాన రహదారి

పాయకరావుపేటలో.. వర్షాలు పడాల్సిన ప్రస్తుత సమయంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవడంతో పాయకరావుపేట నిప్పుల కొలిమిగా మారింది. ఉదయం నుంచే భానుడు తన ప్రతాపం చూపడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వడగాడ్పులు, ఇంట్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. మహిళలు, వృద్ధులు, పిల్లలు సాయంత్రం వరకు ఆపసోపాలతో గడిపారు. బలంగా వీచిన వడగాడ్పులకు భయపడిన ప్రజలు ముఖానికి గుడ్డకట్టుకుని వాహనదారులు రోడ్డుపై ప్రయాణించాల్సి వచ్చింది. స్థానిక తాండవ వంతెనపై తాటాకు గొడుగుల కింద కూర్చుని మామిడిపండ్లు విక్రయించే మహిళలు వేడిగాలులకు ముఖానికి చీర చెంగుతో కప్పుకున్నారు. ఎండలో రోడ్డుపై నడిచేందుకు ఎవరూ సాహసించకపోవడంతో ఎప్పుడూ రద్దీగా ఉండే గౌతమ్ సెంటర్‌తోపాటు అన్ని ప్రధాన సెంటర్లు, వీధులు బోసిపోయాయి.

'విలువ ఆధారిత వస్తువులతో గిట్టుబాటు ధర'

పాయకరావుపేట రూరల్, జూన్ 17: రైతులు పంటలను నేరుగా విక్రయించకుండా విలువ ఆధారిత వస్తువులుగా తయారు చేసి మార్కెటింగ్ చేయడం ద్వారా గిట్టుబాటు ధర లభిస్తుందని తాండవ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం సీఈవో జి.సత్యనారాయణ అన్నారు. సోమవారం సత్యవరంలో జరిగిన సంఘం ద్వితీయ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు స్వయంగా మార్కెట్‌లో ఉత్పత్తులను విక్రయించి స్వయం సమృద్ధిని సాధించాలన్నారు. సంఘ అధ్యక్షుడు విశ్వనాధుని సత్యనారాయణ మాట్లాడుతూ రైతులందరూ వాటా ధనాన్ని చెల్లించి సభ్యులుగా చేరి ప్రభుత్వం అందిస్తున్న మౌలిక సదుపాయాలను పొందాలన్నారు. సంఘం వ్యాపార నిర్వహణలో భాగంగా ఈ ఏడాది విత్తనాలు, క్రిమి సంహారక మందుల విక్రయం ప్రారంభిస్తున్నామన్నారు. రైతులకు స్వల్పకాలిక పెట్టుబడి రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు జి.వర్మ, పి.సూర్యనారాయణ, ఐఐఎంఆర్ ప్రతినిధి శ్రీనువాస్, సంఘ డైరెక్టర్లు, గ్రామపెద్దలు కీర్తి సీతారాం, వడ్డాది వాసు, యగదాసు నానాజీ, గోళ్ల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ రోవర్‌గా బోడపాటి

నక్కపల్లి, జూన్ 17: హిందూస్తాన్ సంస్థ స్కౌట్స్ అండ్ గైడ్స్ రోవర్ (కమిషనర్)గా బోడపాటి శివదత్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో హిందూస్థాన్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ని ఘనంగా సత్కరించారు. ఈ మేరకు జ్ఞాపికను, నియామకపత్రాన్ని అందజేశారు. జనసేన రాష్ట్ర కార్యదర్శిగా ప్రస్తుతం బోడపాటి శివదత్ పనిచేస్తున్నారు. ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ్ వారాహి యాత్రలో ఈయన ఎంతో కీలకంగా వ్యవహరించారు. తనకు స్కౌట్స్ అండ్ గైడ్స్ రోవర్‌గా నియమించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.



ప్రశంసాపత్రాన్ని స్వీకరిస్తున్న బోడపాటి శివదత్

ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానం

కశింకోట, జూన్ 17 : స్థానిక రాజీవ్‌గాంధీ ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో 50 శాతం అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కర్రి శివ సోమవారం తెలిపారు. కళాశాలలో నాలుగు బ్రాంచిలు మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్ ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు ఆయా దరఖాస్తును పూరించి కళాశాలలో అందజేయాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు 9063297220, 08924220377, 9505504220 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బైకులు ఢీ : నలుగురికి తీవ్ర గాయాలు



దార్లపూడిలో జరిగిన ప్రమాద దృశ్యం

ఎస్.రాయవరం, జూన్ 17: మండలంలోని దార్లపూడి సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు, పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఎలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన నగిరెడ్డి శివ, నగిరెడ్డి భాగ్యలక్ష్మి బైకుపై అడ్డురోడ్డు వెళుతున్నారు. అలాగే నక్కపల్లి మండలం చినదొడ్డుగొల్లు గ్రామానికి చెందిన ఏసరపు నాని, శ్రీను బైక్‌పై దార్లపూడి వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు దార్లపూడి సమీపంలోకి వచ్చేసరికి ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు.

తుమ్మపాల షుగర్స్ కార్మికులను ఆదుకోవాలి



కూటమి నేతల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కార్మికులు

తుమ్మపాల, జూన్ 17 : తుమ్మపాల షుగర్స్ ఎన్ఎంఆర్ఐ కార్మికులను తక్షణమే ఆదుకోవాలని కార్మిక సంఘం నాయకులు కొణతాల శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాసరావు కోరారు. సోమవారం ఫ్యాక్టరీ ఆవరణలో ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు కార్మికులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఎన్ఎంఆర్ కార్మికులను వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు చూసిందన్నారు. అర్ధంతరంగా ఫ్యాక్టరీని మూసేసి కార్మికులను రోడ్డున పడేసిందన్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు కె.శ్రీనివాస్, ఏవీఎస్ అప్పారావు, సీహెచ్. శ్రీనివాసరావు, మాటూరి రమణ, కర్రి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ' వసతిగృహాల సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

తుమ్మపాల, జూన్ 17 : ఆదర్శ పాఠశాల వసతిగృహాల్లో విధులు నిర్వహించే సిబ్బందిని క్రమబద్ధీకరించాలని ఏపీటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు కోన లక్ష్మణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కాంట్రాక్టు విధానంలో సుమారు 1500 మంది విధులు నిర్వహిస్తున్నారని, వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నా అరకొర జీతాలతో కుటుంబపోషణ ఇబ్బందికరంగా మారిందన్నారు. తక్షణమే సిబ్బంది వేతనాలను పెంచి ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ మేరకు ఏపీటీయూసీ నాయకులు మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రాన్ని సమర్పించినట్టు ఆయన చెప్పారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, జూన్ 17 : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కొణతాలను సత్కరించారు. జ్యేష్ఠ మాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయ మండపంలో చింతామణి గణపతి దత్తక్షేత్రం ఆధ్వర్యంలో అనఘాష్టమి వ్రతాన్ని మహిళా భక్తులు సామూహికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషకుమార్, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బిళ్లపాటి కృష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు పాల్గొన్నారు.

దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణ రాట ముహూర్తం

అనకాపల్లి టౌన్, జూన్ 17 : స్థానిక గవరపాలెం సతకంపట్టు వద్ద గల కనకదుర్గమ్మ ఆలయ సప్తమ వార్షికోత్సవంలో భాగంగా దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ రాట ముహూర్తాన్ని సోమవారం ఆలయం వద్ద ఘనంగా నిర్వహించారు. కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి సౌజన్యంతో ఉదయం పెళ్లిరాట వేశారు. ఈనెల 19వ తేదీన దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పొలిమేర శ్రీను, కర్రి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

పరవాడ, జూన్ 17 : మండలంలో పెదతాడి ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, నీలబాబు దంపతులతో పాటు పలువురు కల్యాణంలో పాల్గొని పూజలు చేశారు. వేదపండితుల మంత్రోశ్ఛరణల మధ్య శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతులకు కానుకలు సమర్పించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కోమటి అచ్చిబాబు, కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పాల సొసైటీ డైరెక్టర్ల ఎన్నిక

సబ్బవరం, జూన్ 17: మండలంలోని బంగారమ్మపాలెంలో సోమవారం పాల సొసైటీ అధ్యక్షుడు దొడ్డి స్వామేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన పాల సొసైటీ ఎన్నికల్లో పాడి రైతులు దొడ్డి రామప్పడు, మద్దాల భవానీలను డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు స్వామేశ్వరరావు మాట్లాడుతూ.. విశాఖ డెయిరీ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి డైరెక్టర్లు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి లావణ్య, గ్రామ పెద్దలు, పాడి రైతులు దాడి త్రిమూర్తుల కన్నంనాయుడు, దొడ్డి ప్రకాశ్, సీఎస్ సూరిశెట్టి రామకృష్ణ, మాలినాయుడు, రాజుకోటి, సూరిశెట్టి రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో అరాచకం

... 5వ పేజీ తరువాయి

కౌన్సిల్ మెంబర్‌గా వ్యవహరిస్తున్నారు. వర్సిటీలోని కీలక పదవిలో ఉంటుండగా పీహెచ్‌డీలో ప్రవేశం పొందకూడదు. కానీ, ఈ నిబంధనను కూడా ఉల్లంఘించి మరీ ఆయన ప్రవేశాన్ని పొందారని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. అధికారాన్ని దుర్వినియోగం చేసి ఉన్నతాధికారి అండదండలతోనే పీహెచ్‌డీ ప్రవేశాన్ని పొందినట్టు చెబుతున్నారు. ఇదిలావుండగా స్టీఫెన్ పీహెచ్‌డీ ప్రవేశం ప్రస్తుతం హెచ్‌వోడీగా ఉన్న ప్రొఫెసర్‌కు తెలియకుండా జరగడం గమనార్హం. పీహెచ్‌డీ పరీక్షలకు సంబంధించిన దరఖాస్తును హెచ్‌వోడీకి ముందుకు పంపించాల్సిందిగా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి.

నిబంధనలు ఉల్లంఘనే..

వర్సిటీలోకి ప్రొఫెసర్ స్టీఫెన్ వచ్చిన దగ్గర నుంచి అనేక ఉల్లంఘనలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. అసలు స్టీఫెన్ ప్రవేశమే నిబంధనలకు విరుద్ధమని చెబుతున్నారు. ప్రైవేటు కాలేజీలో పనిచేస్తున్న ఆయన అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌గా నిబంధనలకు విరుద్ధంగా అప్పట్లో చేరారు. ఆ తరువాత ఎంతో మందిని సీనియర్లను పక్కనపెట్టి మరీ ట్రాన్స్ డిసిప్లినరీ హబ్‌కు డీన్‌గా వర్సిటీ ఉన్నతాధికారులు నియమించారు. ఇదే టీడీఆర్ హబ్ నుంచి వందలాది మందికి అడ్డగోలుగా ప్రవేశాలు కల్పించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ తరువాత వర్సిటీలోని రెగ్యులర్ ప్రొఫెసర్ల సీనియారిటీని పక్కనపెట్టి మరీ ఆయనకు ఉన్నతాధికారులు రిజిస్ట్రార్‌గా బాధ్యతలను అప్పగించారు. ఇది వర్సిటీ చరిత్రలోనే మరో అడ్డగోలు నిర్ణయంగా విమర్శలు వెల్లువెత్తాయి.

ఆర్‌ఈసీఎస్ పరిధిలో అప్రకటిత విద్యుత్ కోతలు

అచ్యుతాపురం, జూన్ 17: మండలంలో ఆర్‌ఈసీఎస్ పరిధిలోని గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో కొన్ని పంచాయతీలు ఏపీఈపీడీసీఎల్ పరిధిలో ఉండగా, దోసూరు, రాజానపాలెం, తంతడి తదితర పంచాయతీలు ఆర్‌ఈసీఎస్ పరిధిలో ఉన్నాయి. ఈ గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోత విధిస్తున్నారు. వారం రోజుల నుంచి ఎప్పుడు విద్యుత్ ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది.

హడలెత్తిస్తున్న హాస్టల్

... 5వ పేజీ తరువాయి

పెంకులు జారి మీద పడడంతో విద్యార్థులు గాయాల పాలవుతున్నారు. ఇక్కడ తమ పిల్లలను చేర్పేందుకు తల్లిదండ్రులు వెనకడుగు వేస్తున్నారు. గతంలో 100కు పైన ప్రవేశాలు ఉండగా, ప్రస్తుతం 44కి పడిపోయింది. పరాయి పంచన ఉన్న వసతి గృహానికి సొంత భవనం ఏర్పాటు చేయాలని పలు మార్లు సాంఘిక సంక్షేమ శాఖాధికారులను కోరినా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు, స్థానికులు వాపోతున్నారు. దీనికి తోడు భవనం యాజమాని పదేళ్లగా హాస్టల్ ఖాళీ చేయమని అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇక్కడ ప్రత్యామ్నాయ భవనాలు లేకపోవడంతో సంక్షేమ శాఖాధికారులు యాజమానిని బుజ్జగిస్తూ వస్తున్నారు. దీంతో భవన యాజమాని దెబ్బతిన్న వసతిగృహం భవనం మరమ్మతులను గాలికి వదిలేయడంతో భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. సొంత భవనం నిర్మాణానికి సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



అనకాపల్లి ఎంపీ రమేష్‌కు వినతిపత్రం అందిస్తున్న జనసేన నాయకులు

ఈనాం భూముల సమస్య పరిష్కరించాలి

గొలుగొండ, జూన్ 17: మండలంలోని పలు గ్రామాల్లో ఈనాం భూముల సమస్య పరిష్కరించాలని జనసేన పార్టీ మండల నాయకుడు పీవీనరసింహారావు కోరారు. ఈ మేరకు పలువురు రైతులు, నాయకులతో కలిసి అనకాపల్లి ఎంపీ సీఎం.రమేష్‌కు క్యాంపు కార్యాయలంలో సోమవారం వినతిపత్రం అందించారు. మండలంలోని రాజుపేట, కొత్తఎల్లవరం, జిల్లేడపూడి, కశిమి, దోనిపాలెం గ్రామాల్లో సుమారు 1500 ఎకరాల్లో సుమారు వెయ్యి మంది ఈనాందారులు సాగు చేసుకుంటున్నారన్నారు. ఆ భూముల సమస్య సుమారు 40 ఏళ్ల నుంచి పరిష్కారం కాలేదని వాపోయారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించాలని సమస్యపై వెంటనే స్పందించాల విజ్ఞప్తి చేశారు.

బుడ్డడపాడులో ఇంటింటికీ కొళాయిలు



జల్‌జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

గొలుగొండ, జూన్ 17: బుడ్డడపాడు గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కొళాయిలు పనులు ఏర్పాటుకు సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి సోమవారం శంకుస్థాపన చేశారు. మండలంలోని పాతమల్లంపేట గ్రామంలో శివారు బుడడ్డ పాడు గ్రామంలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకుగాను కేంద్ర ప్రభుత్వం 2.8 లక్షలు చేసింది. దీంతో పనులు సర్పంచ్ ప్రారంభించారు. ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసి త్వరితగతిన నితరంతరం తాగునీరు అందించేందుకుగాను కృషి చేస్తున్నట్టు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గెడ్డం నానాజీ, గెడ్డం ఆనంద్, రుత్తల సత్యనారాయణ, సెగ్గే రాము పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి 'కింజరాపు'తో భేటీ

చీడికాడ/ కె.కోటపాడు జూన్ 17: విశాఖకు వచ్చేసిన కేంద్ర పౌరవి మా న యానశాఖ మంత్రి కింజ రాపు రామ్మో హన్‌నాయు డుతో మాడుగుల ఎ మ్మెల్యే బండారు సత్య నారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామా నాయుడు భేటీ అయ్యారు. సోమవారం విమానాశ్రయానికి వచ్చిన మంత్రికి ముందుగా స్వాగ తంపలికిసత్కరించారు. అనంతరం మాడుగుల నియోజకవర్గానికి సంబం ధించి పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసు కువెళ్లారు.



రామ్మోహన్‌నాయుడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, రామానాయుడు

ఏయూలో అరాచకం

... 5వ పేజీ తరువాయి

కౌన్సిల్ మెంబర్‌గా వ్యవహరిస్తున్నారు. వర్సిటీలోని కీలక పదవిలో ఉంటుండగా పీహెచ్‌డీలో ప్రవేశం పొందకూడదు. కానీ, ఈ నిబంధనను కూడా ఉల్లంఘించి మరీ ఆయన ప్రవేశాన్ని పొందారని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. అధికారాన్ని దుర్వినియోగం చేసి ఉన్నతాధికారి అండదండలతోనే పీహెచ్‌డీ ప్రవేశాన్ని పొందినట్టు చెబుతున్నారు. ఇదిలావుండగా స్టీఫెన్ పీహెచ్‌డీ ప్రవేశం ప్రస్తుతం హెచ్‌వోడీగా ఉన్న ప్రొఫెసర్‌కు తెలియకుండా జరగడం గమనార్హం. ప్రీ పీహెచ్‌డీ పరీక్షలకు సంబంధించిన దరఖాస్తును కూడా హెచ్‌వోడీకి తెలియకుండానే ముందుకు పంపించాల్సిందిగా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి.

నిబంధనలు ఉల్లంఘనే..

వర్సిటీలోకి ప్రొఫెసర్ స్టీఫెన్ వచ్చిన దగ్గర నుంచి అనేక ఉల్లంఘనలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. అసలు స్టీఫెన్ ప్రవేశమే నిబంధనలకు విరుద్ధమని చెబుతున్నారు. ప్రైవేటు కాలేజీలో పనిచేస్తున్న ఆయన అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌గా నిబంధనలకు విరుద్ధంగా అప్పట్లో చేరారు. ఆ తరువాత ఎంతో మందిని సీనియర్లను పక్కనపెట్టి మరీ ట్రాన్స్ డిసిప్లినరీ హబ్‌కు డీన్‌గా వర్సిటీ ఉన్నతాధికారులు నియమించారు. ఇదే టీడీఆర్ హబ్ నుంచి వందలాది మందికి అడ్డగోలుగా ప్రవేశాలు కల్పించారన్న ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఆ తరువాత వర్సిటీలోని ఎంతోమంది రెగ్యులర్ ప్రొఫెసర్ల సీనియారిటీని పక్కనపెట్టి మరీ ఆయనకు ఉన్నతాధికారులు రిజిస్ట్రార్‌గా బాధ్యతలను అప్పగించారు. ఇది వర్సిటీ చరిత్రలోనే మరో అడ్డగోలు నిర్ణయంగా అప్పట్లోనే విమర్శలు వెల్లువెత్తాయి.

'ఎత్తిపోతల'పై చిగురిస్తున్న ఆశలు

▸▸ వైసీపీ పాలనలో పడకేసిన నిర్మాణ పనులు ▸▸ కూటమికి అధికారంతో నిర్వాసితుల ఎదురుచూపులు

బుచ్చెయ్యపేట, జూన్ 17 : గత ఐదేళ్లుగా తిండిగింజలపై అడుగంటిన ఆశలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లూలూరు భూ నిర్వాసితుల్లో చిగురించాయి. లూలూరు రెవెన్యూలో 120 ఎకరాల్లో తిండిగింజలు సాగుచేసే పల్లపు భూములను నాయకుల హామీ మేరకు 2015-16లో డిఫెన్స్ రీజెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనేజేషన్ (డీఆర్‌డీఓ) సైనిక శిక్షణ శిబిరం ఏర్పాటుకు 250 మంది రైతులు ఇచ్చారు. అప్పటి చోడవరం ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్.రాజు ఈ విషయాన్ని సీ ఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో 2016- 17లో ఎల్‌బీపీ.అగ్రహారం రెవెన్యూ పరిధిలో పెద్దేరుపై ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.4.50 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఏపీ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌ఐడీసీ) పిలిచిన టెండర్లను విజయవాడకి చెందిన శ్రీనివాసరావు దక్కించుకుని చకచకా పనులు చేపట్టారు. చేపట్టిన ఏడాదిలోగానే ట్యాంకు, జాకీవెల్, పంపు హౌస్, ఎలక్ట్రికల్ సరఫరాకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, మోటార్లు బిగింపు, 3.5 కిలోమీటర్ల పైపులైన్‌కు గాను రైతులు సహకరించడంతో 3 కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణ పనులను 2018లోనే పూర్తయ్యాయి. చేసిన పనులకు సుమారు రూ. 3.5 కోట్ల చెల్లింపులను కార్పరేషన్ ఇంజనీరింగ్ అధికారులు చేపట్టారు. ఈ దశలో తమ భూముల్లో నుంచి పథకం పైపులైన్ వెళ్లడంపై అభ్యంతరం తెలుపుతూ, ఆరుగురు రైతులు హైకోర్టుని ఆశ్రయించడంతో ఆ భూముల్లో నుంచి పైపులైన్ నిర్మాణంపై హైకోర్టు స్టే విధించింది. అభ్యంతర భూముల్లో నుంచి కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఐదేళ్లుగా రైతులు చేసిన సూచలను అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో పనులు ఎక్కడక్కడ నిలిచిపోయాయి. దీంతో చేసేది లేక సదరు కాంట్రాక్టరు పైపులు, వాల్వు తదితర సామగ్రిని క్షేత్రస్థాయి నుంచి తరలించుకుపోవడంతో లూ లూరు భూ నిర్వాసితుల రైతుల్లో ఆశలు అడుగంటిపోయాయి. దేశ రక్షణకు తమకున్న కొద్దిపాటి పల్లం భూములు త్యాగం చేసిన తమ సమస్యపై నిర్లక్ష్యం వహించడంపై ఆవే దన వ్యక్తం చే శా రు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఈ ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులను, తిరిగి కూటమి ప్రభుత్వం తిరిగి నిలిచిన పనులను పునఃప్రారంభించి పూర్తి చేయగలదని ఎల్‌బీపీ. అగ్రహారం, బంగారుమెట్ట, లోపూడి, ఎల్.సింగవరం గ్రామాలకు చెందిన భూ నిర్వాసిత రైతులు ఆశాభావం వ్యకం చేస్తున్నారు.



పూర్తయిన ఎత్తిపోతల పథకం పంపు హౌస్



ఐదేళ్లుగా వృథాగా మిగిలిన అవుట్‌లేట్ ట్యాంకు



పథకం నిర్వాహణకు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్సఫార్మర్

చోడవరం అభివృద్ధికి కట్టుబడి ఉంటా..

▸▸ పార్టీలో కష్టపడిన నాయకులకు సముచిత న్యాయం

▸▸ విజయోత్సవ సభలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్

చోడవరం, జూన్ 17: ఎంపీగా తనను ఆదరించి అత్యధికమెజారిటీతో గెలిపించిన చోడవరం నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ హామీ ఇచ్చారు. సోమవారం స్థానిక శివాలయం ఆవరణలో ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సభతో పాటు నియోజకవర్గ కూటమి పార్టీల ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంతానికి తాను కొత్తవాడినయినా, తనను జిల్లా ప్రజలు ఆదరించి భారీ మెజారిటీతో గెలిపించిన తీరు తాను జీవితాంతం మరచిపోలేనన్నారు. చోడవరం ప్రాంతం అభివృద్ధికి ఈ ఐదేళ్లల్లో ప్రణాళికయుతంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

చోడవరం- నర్సీపట్నం రోడ్డు, వంతెనల అభివృద్ధిపై దృష్టి

ఈ సందర్భంగా కూటమినేతలు తన దృష్టికి తీసుకుని వచ్చిన చోడవరం బీ ఎన్ రోడ్డు అభివృద్ధితో పాటు,వంతెనల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని సీఎం రమేష్ హామీ ఇచ్చారు.

ఇబ్బందులు పెట్టిన వారిని వదిలిపెట్టేది లేదు..

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలను ఇబ్బందిపెట్టిన అధికారులను అధికార పార్టీ నేతలను తాము వదిలిపెట్టేది లేదని సీఎం రమే ష్ హెచ్చరించారు. అలాగే కొందరు నేతలు ఇప్పటికే తాము టీడీపీ లేదా జనసేన బీజేపీలో చేరుతామంటూ సమాచారం పంపుతున్నారని, దిగువ స్థాయి నాయకుల అనుమతి లేకుండా ఎవరినీ పార్టీలో చేర్చుకునేది లేదని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు మాట్లాడుతూ, నియోజకవర్గంలో రహదారులు, వంతెనలు, గ్రోయిన్ల అభి వృద్ధి అంశం ఎంపీ దృష్టికి తీసుకుని వచ్చారు. అలాగే సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తికి, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. సభలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి, జనసేన నాయకుడు పీవీఎస్ ఎన్ రాజు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు తదితరులు మాట్లాడారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పెదబాబుపాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రమేష్‌ను ఘనంగా సత్కరించారు.



సీఎం రమేష్‌ను సత్కరిస్తున్న కూటమి నేతలు

తాచేరుపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభానికి కృషి

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో విజయరామరాజుపేట వద్ద తాచేరు వంతెన నిర్మాణ పనులు ప్రారంభానికి కృషి చేస్తానని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. ఆయన సోమవారం ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్.రాజు, కూటమి నాయకులతో కలసి కూలిపోయిన విజయరామరాజుపేట వంతెను పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ డీఈఈ ధనుంజయుని వంతెన నిర్మాణంపై చర్చించారు. బిఎన్.రోడ్డు అభివృద్ధికి మంజూరైన డీఎన్‌బీ రూ.32 కోట్లలో విజయరామరాజుపేట వంతెన నిర్మాణానికి రూ.6 కోట్లు అంచనాలు ఆమోదం పొందినట్టు డీఈఈ తెలిపారు. అలాగే, బిల్లుల చెల్లింపు జాప్యంతో సదరు కాంట్రాక్టరు రోడ్డు నిర్మాణ పనులను నిలిపివేశారని డీఈఈ వివరించారు. సమస్యపై టీఆర్‌అండ్‌బీ కార్యదర్శితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ జిల్లాఅధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, కూటమి నాయకులు గేదెల సత్యనారాయణ, కోట్ని బాలాజీ, సురేంద్ర మోహన్, దాడి రత్నాకర్, గునూరు మల్లునాయుడు, పీవీఎస్‌ఎన్.రాజు, శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, సాయం శేషు, దొండా శ్రీను, ఎంవీవీ సత్యనారాయణ, పాల్గొన్నారు.



మొక్కులు తీర్చుకోవడానికి కాలినడకన నాతవరం నుంచి సింహాచలం బయలుదేరిన కూటమి నాయకులు

సింహాచలానికి కాలినడకన కూటమి నాయకులు

నాతవరం, జూన్ 17: మండల కేంద్రం నుంచి సింహాచలానికి మొక్కులు తీర్చుకోవడానికి కాలినడక సోమవారం ఉదయం కూటమి నాయకులు బయలుదేరి వెళ్లారు. టీడీపీ వాణిజ్య విభాగం నాయకులు యర్రా కాశీ విశ్వేశ్వరావు(కాశీ) ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు స్థానిక వరసిద్ధి వినాయకుని ఆలయం వద్ద పూజలు నిర్వహించి కాలినడన సింహచలం వరాహలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు యర్రా కాశీ మాట్లాడుతూ కూటమి టీడీపీ అధికారంలోకి రావాలని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, నర్సీపట్నం ఎమ్మెల్యేగా చింతకాయల అయ్యన్నపాత్రుడు గెలిస్తే మండలకేంద్రం నాతవరం నుంచి సింహచలం కాలినడకన వస్తామని స్వామివారికి మొక్కుకున్నామని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావటంతో మొక్కు తీర్చుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఎన్.విజయ్‌కుమార్, కూటమి నాయకులు అపిరెడ్డి మాణిక్యం శెట్టి నాయుడు, పారుపల్లి కొండబాబు, జీరెడ్డి రాజుబాబు, చింతకాయల శ్రీనువాసరావు, శెట్టి లోవ, శెట్టి నానాజీ, సామర్ల రామారావు తదితరులు వీరికి సంఘీభావం తెలిపారు.

విద్యా, వైద్య రంగాలు అంటే ఇష్టం: అయ్యన్న



అయ్యన్నకు జ్ఞాపిక అందజేస్తున్న దాడి రత్నాకర్

నర్సీపట్నం, జూన్ 17: విద్యా, వైద్య రంగాలను అభివృద్ధి చేయడమంటే తనకు చాలా ఇష్టమని, తన హయాంలో వాటికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం డీఈవో వెంకలక్ష్మమ్మ మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి సంబంధించి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నర్సీపట్నంలో విద్యా, వైద్య రంగాలు, గ్రామీణ ప్రాంతంలో తాగు నీటి సౌకర్యం, రోడ్ల అభివృద్ధి చేసే అవకాశం వచ్చిందన్నారు. అలాగే అనకాపల్లి నుంచి దాడి రత్నాకర్, పలువురు టీడీపీ నాయకులు సోమవారం అయ్యన్నకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం, విఘ్నేశ్వరుడు చిత్రపటం, జ్ఞాపిక అందజేశారు.

ప్రైవేటు విద్యా సంస్థల ఆవరణలో పుస్తకాలు విక్రయించొద్దు: డీఈవో

నర్సీపట్నం, జూన్ 17: ప్రైవేటు విద్యా సంస్థల ఆవరణలో పుస్తకాలు అమ్మకూడదని డీఈవో వెంకటలక్ష్మమ్మ స్పష్టం చేశారు. సోమవారం నర్సీపట్నం వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో అధిక ఫీజులు, పుస్తకాలు అమ్మకాలుపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. నర్సీపట్నం ఎంఈవోకి తనిఖీలు చేయమని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలను గుర్తించేందుకు త్రిసభ్య కమిటీ వేశామన్నారు. ఈ నెల 14 నుంచి జూలై 11 వరకు బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడమే లక్ష్యమంగా 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

హడలెత్తిస్తున్న హాస్టల్

... 5వ పేజీ తరువాయి

పెంకులు జారి మీద పడడంతో విద్యార్థులు గాయాల పాలవుతున్నారు. ఇక్కడ తమ పిల్లలను చేర్పేందుకు తల్లిదండ్రులు వెనుకడుగు వేస్తున్నారు. గతంలో 100కు పైన ప్రవేశాలు ఉండగా, ప్రస్తుతం 44కి పడిపోయింది. పరాయి పంచన ఉన్న వసతి గృహానికి సొంత భవనం ఏర్పాటు చేయాలని పలు మార్లు సాంఘిక సంక్షేమ శాఖాధికారులను కోరినా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు, స్థానికులు వాపోతున్నారు. దీనికి తోడు భవనం యాజమాని పదేళ్లుగా హాస్టల్ ఖాళీ చేయమని అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇక్కడ ప్రత్యామ్నాయ భవనాలు లేకపోవడంతో సంక్షేమ శాఖాధికారులు యాజమానిని బుజ్జిగిస్తూ వస్తున్నారు. దీంతో భవన యాజమాని దెబ్బతిన్న వసతిగృహం భవనం మరమ్మతులను గాలికి వదిలేయడంతో భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. సొంత భవనం నిర్మాణానికి సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భానుడు ప్రతాపం.. బెంబేలెత్తిన జనం

మాకవరపాలెం, జూన్ 17: మండలంలో సోమవారం భానుడు భగ్గుమన్నాడు. ఎండ ప్రచండానికి జనం బెంబేలెత్తిపోయారు. పెరిగిన ఉష్ణోగ్రతలతో విలవిలలాడిపోయారు. ఉదయం ఏడు గంటల నుంచి ఎండ ప్రతాపం చూపడంతో ప్రజలు ఇంటిదారి పట్టారు. ఉపాధి, వ్యవసాయ కూలీలు 9 గంటలకే ఇళ్లల్లోకి వెళ్లిపోయారు. అలాగే మధ్యాహ్నం 12 గంటలకే వ్యాపారులు దుకాణాలు మూసివేశారు. సాయంత్రం ఐదు గంటలకుగాని మళ్లీ షాపులు తెరవలేదు. తీవ్ర స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరగండంతో గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు.



నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి



అయ్యన్నను కలిసి కృతజ్ఞతలు చెబుతున్న నేతలు

ప్రహరీ గోడకు అనుమతి ఇవ్వాలి

నర్సీపట్నం అర్బన్/కృష్ణాదేవిపేట, జూన్ 17: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చరిత్రకు సాక్ష్యంగా నర్సీపట్నంలోని సమాధుల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి అల్లూరి సంఘం సిద్ధంగా ఉందని సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు అన్నారు. సంఘ నాయకులతో కలిసి సోమవారం సమాధులను పరిశీలించారు. అనంతరం నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడును కలిశారు. ఈ సందర్భంగా విలేకరులతో వీరభద్రరావు మాట్లాడారు. అల్లూరి చరిత్రకు సంబంధించి ఎంతో విలువైన 2/3 అడుగుల భారీ సైజు 30 చిత్రాలను తమ సంఘం సొంత నిధులతో పార్కులోని ఆడిటోరియంలో శ్వాశతంగా అమర్చాలని నిర్ణయించామన్నారు. దీంతో పాటు ప్రహరీ గోడ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శివంగి నాగేశ్వరరావు, శ్యామల వరలక్ష్మి, కంబలాల శంకర్రావు, ఎన్‌టీ.వర్మ, పి.శరత్, జి.చిట్టిబాబు, శివంగి ప్రియదర్శి పాల్గొన్నారు.

'పల్లా'ను కలిసిన తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, జూన్ 17: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఆయనకు శాలువ కప్పి, పుష్ప గుచ్ఛం అందించారు. రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు విజయవంతంగా నిర్వహించాలని తాతయ్యబాబు ఆకాక్షించారు.

కల్యాణ వేంకటేశ్వరునికి పూజలు



స్వామి వారికి పూజలు చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్, జూన్ 17: మండలంలోని కేజే పురం జంక్షన్‌లో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారి కల్యాణం ఎంతో వైభవంగా జరిగింది. ఆలయ 14వ వారికోత్సవ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి ఎదురు సన్నాహం, కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారికి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ గావించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేటి రామకొండరావు, కమిటీ సభ్యులు భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.

వైభవంగా ఏకాదశి పూజలు



మారేపల్లి ఆలయ పూజల్లో భక్తులు

దేవరాపల్లి, జూన్ 17: మండలంలోని ఆలయాల్లో సోమవారం ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. దేవారాపల్లి, పెదనందిపల్లి, చిననందిపల్లి, కొత్తపెంట, తెనుగుపూడి, దేవరాపల్లి, వేంకటేశ్వరస్వామి, దేవి ఆలయంలో ఈ పూజలు నిర్వహించారు. మారేపల్లిలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పంచామృత అభిషేకం, సుగంధ ద్రవ్యాభిషేకం, పూర్ణాహుతి జరిగింది. దంపతులతో భరతానంద మహరాజ్ ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్‌కు ధర్మశ్రీ పరామర్శ

రోలుగుంట, జూన్ 17 : మండలంలోని జానకీరాంపురానికి చెందిన మాజీ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్, మండల వైసీపీ సీనియర్ నేత తమరాన వెంకటరమణ ఇటీవల గుండెపోటుకు లోనై వైద్య సేవలు పొందారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సోమవారం జానకీరాంపురం వెళ్లి వెంకటరమణను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. కుసర్లపూడి సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు, గొల్లు రాజుబాబు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

కె.కోటపాడు, జూన్ 17: మండల కేంద్రంలో ముస్లిం సోదరులు సోమవారం బక్రీద్ పండగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీ దులో మతపెద్దలు షేక్ సతర్, షేక్ ఇబ్రహిం, షేక్ నాగుర్, ముస్లిం లు నమాజ్ చేశారు. అనంతరం అందరూ స్వీట్స్ పంచిపెట్టారు. బక్రీద్ సందర్భంగా వారి ఆచార ప్రకారం పొట్టేళ్లను నరికి వంటా వార్పు చే సుకుని సమీపంలోని వారికి పంచిపెట్టారు.

20న కేపీ అగ్రహారంలో రక్తదాన శిబిరం

బుచ్చెయ్యపేట, జూన్ 17: కెపీ.అ గ్రహారంలో ఈ నెల 20వ తేదీన వేగువేరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోగా రక్తవైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. దాతలు వచ్చి రక్తదానం చేసి సహకరించాలని కోరారు.

దేవాలయాల భూముల కౌలు వేలం రేపు

బుచ్చెయ్యపేట, జూన్ 17: వడ్డాది వేంకటేశ్వర స్వామి, మల్లికార్జునస్వామి దేవాలయాల భూములు కౌలుకు బుధవారం వేలం నిర్వహించనున్నట్టు దేవదాయ శాఖ ఈఓ శర్మ తెలిపారు. ఈ వెంకటేశ్వరునికి చెందిన ఏడు ఎకరాలు, మల్లికార్జునస్వామికి చెందిన7.86 ఎకరాల కౌలుకు గాను ఆయా ఆలయాల వద్ద వేలం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

ఏపీఎంటీడబ్ల్యూ యూనియన్ ఏర్పాటుకు చర్యలు

పాడేరు రూరల్, జూన్ 17: ఆంధ్రప్రదేశ్ మెడికల్ ట్రైబల్ ఉమెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామని మహిళా ఉద్యోగులు తెలిపారు. వైద్య శాఖలో ట్రైబల్ మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యూనియన్ అవసరమన్న ఉద్దేశంతో గిరిజన ఉద్యోగుల సంఘం భవనంలో వివిధ పీహెచ్‌సీల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు ఈ నిర్ణయం తీసుకున్నారు.